క్లుప్తంగా

వినాయక మట్టి విగ్రహాల పంపిణీ



మరిపివలసలో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కలిపిస్తున్న హెచ్ఎం తవిటినాయుడు

సీతానగరం: వినాయక మట్టి విగ్రహాలను మండల కేంద్రంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. ఎల్వీఆర్ సేవా సంస్థ ప్రతినిధి కె.అరవింద్ ఆధ్వర్యంలో సమకూర్చిన విగ్రహాలను ఉచితంగా అందజేశారు. కాలుష్య నివారణకు ఈ విగ్రహాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సర్పంచ్ జె.తేరేజమ్మ పలువురు సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మట్టి వినాయక విగ్రహాలపై మరిపివలస ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వి.తవిటినాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా.. : ఎమ్మెల్యే

బలిజిపేట: పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం తనవంతు సహకారాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. గలావల్లి కామలింగేశ్వర ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఆలయం స్థితిగతులను, పూర్వాపరాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గలావల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి తెలుసుకున్న ఆయన పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



వరి వెదజల్లిన పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

సీతానగరం: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రంగంపేట గ్రామంలో నేరుగా వెదజల్లే పద్ధతిలో వేసిన వరి పంటను ఏఓ ఎస్.అవినాష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు పలు సూచనలు చేసారు. వరి వెద పద్ధతిలో పాటించాల్సిన మెలకువలు తెలియజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: జిల్లాలో క్రీడలను అన్ని విధాల ముందుకు తీసుకువెళ్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావునాయుడు కోరారు. ఈ మేరకు డీఈఓ జి.పగడాలమ్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కోరారు. క్రీడల అభివృద్ధికి రావాల్సిన నిధులు తొందరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి, మొక్కజొన్న



శంబర గ్రామంలో నేలకొరిగిన అరటి పంట

మక్కువ: ఈదురుగాలుల బీభత్సానికి అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మండలంలోని శంబర గ్రామ సమీపంలో గురువారం రాత్రి వీచిన గాలులకు తోడు వర్షం భారీగా కురవడంతో అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. అప్పులు చేసి, పండించిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమ పంటలకు పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలకొరిగిన పంటలను శుక్రవారం ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించినట్టు రైతులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- నిలిచిపోయిన వాహనాలు
- బకాయిలు చెల్లించకపోవడంతో ఆయిల్ బంద్
- మంత్రి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపం
- పేరుకుపోయిన చెత్త
- వర్షాలతో దుర్వాసన



నాయుడువీధి రామమందిరం వద్ద పేరుకుపోయిన చెత్త

పారిశుద్ధ్య వాహనాలకు ఇంధనం కొరత

సాలూరు: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు మున్సిపాలిటీలో ప్రజలను అపారిశుద్ధ్యం చుట్టుముట్టింది. వార్డుల్లో పేరుకుపోయిన చెత్తతో ప్రజలు దుర్వాసన భరించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సమయంలో వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ఎక్కడ ప్రబలి ఎవరిని బలిగొంటాయోనన్న ఆందోళన ప్రజలన భయభ్రాంతులకు గురి చేస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీలో చెత్తను తరలించేందుకు ప్రతి రోజూ వచ్చే వాహనాలకు సంబంధించి ఆయిల్ బిల్లులను బంకులకు చెల్లించలేదు. బకాయి సొమ్ములు రూ.లక్షల్లో పేరుకుపోవడంతో బంక్‌ల యజమానులు ఆయిల్ ఇవ్వడానికి నిరాకరించారు. గడిచిన మూడు రోజులుగా వాహనాలకు ఆయిల్ లేక మున్సిపల్ కార్యాలయంలోనే చెత్త వాహనాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు తమ చేతి చమురుతో ఈ వాహనాల నడిపేందుకు ప్రయత్నించి రోజూ డబ్బులు చెల్లించలేక చేతులెత్తేసారు.



వార్డుల్లో పేరుకుపోయిన చెత్త

వార్డుల్లో కంపు

చెత్త తరలించే వాహనాలు రాకపోవడంతో వార్డుల్లో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయింది. వర్షాలకు చెత్త కాస్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్ల మీద వెళ్లే వారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పండగ వేళ ఈ పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విజయవాడ వెళ్లిన పారిశుద్ధ్య కార్మికులు

ఇప్పటికే చెత్త వాహనాలు తిరిగే పరిస్థితి లేకుంటే.. మరోవైపు విజయవాడను వరదలు ముంచెత్తడంతో ఇక్కడి పారిశుద్ధ్య కార్మికులు 20 మందిని విజయవాడ పంపినట్టు సమాచారం. వీరి రవాణా తదితర ఖర్చులను అధికారులే భరించే పరిస్థితి. అటు చెత్త వాహనాలు రాక.. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులు తగినంత మంది లేక వార్డుల్లో పారిశుద్ధ్య పరిస్థితి దయనీయంగా తయారైంది.

బకాయిలు చెల్లించనందుకే..

> మున్సిపాలిటీ పారిశుద్ధ్య వాహనాలకు సంబంధించి ఆయిల్ బంకులకు మూడు నెలల నుంచి బకాయిలు చెల్లించాల్సి ఉంది. రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోవడంతో వారు ఆయిల్ పంపిణీని నిలిపివేశారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి.
>
> – పైడిరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సాలూరు

ఇన్‌చార్జ్ కమిషనర్ ఎవరు?

ఇదిలా ఉండగా మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి ఈ నెల 2న బదిలీపై సెల్ఫ్ రిలీవింగ్ తీసుకుని వెళ్లిపోయారు. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డీఈ శ్రీరామ్మూర్తి బాధ్యతలు చేపట్టగా, 3వ తేదీన ఆయన్ను, మరి కొందరు మున్సిపల్ అధికారులను విజయవాడ తుఫాన్ విధులకు నియమించడంతో వారంతా విజయవాడ వెళ్లారు. దీంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. విజయవాడ వెళ్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ మున్సిపాలిటీ బాధ్యతలు కొన్ని రోజులు చూసుకోండని టౌన్ ప్లానింగ్ అధికారి పద్మజకు చెప్పారే తప్ప లిఖితపూర్వకంగా ఆమెకు ఎటువంటి బాధ్యతలు ఇవ్వలేదు. వినాయక చవితి పండగ వేళ సాలూరు మున్సిపాలిటీలో నెలకొన్న పారిశుద్ధ్య పరిస్థితులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.



ఇంధనం లేక మున్సిపల్ కార్యాలయం వద్ద నిలిచిపోయిన చెత్త వాహనాలు

అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు..

పార్వతీపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదని రూరల్ ఎస్‌ఐ దినకర్ అన్నారు. మండలంలోని ఎమ్మార్ నగరం గ్రామంతో పాటు పలు గ్రామాల్లో ఆయన ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించేటప్పుడు ప్రభుత్వ ద్వారా అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. అవసరం ఉన్న చోట ఉత్సవ కమిటీలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్‌ఐ

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి

పార్వతీపురం టౌన్: మహిళలు, బాలికలలో రక్తహీనత నివారణ, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం సక్రమంగా అందేటట్టు చూడాలని ప్రత్యేక అధికారి, డివిజనల్ అభివృద్ధి అధికారి ఎన్.రమేష్ రామన్ తెలిపారు. స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణ చట్టాలు, హక్కులు, పోషకాహారం సరఫరాపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల సంక్షేమం, రక్షణ కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పలు పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషణ్ మాహ్ కార్యక్రమం పరిశీలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పిల్లల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గ్రోత్ మానిటరింగ్, రక్తహీనత, ఆరోగ్య నిర్వహణ, నీతి ఆయోగ్ సూచికల ప్రకారం పెరుగుదల, పిల్లల వసతిగృహాలలో సౌకర్యాలు, బాల్య వివాహాల నిషేధ చట్టం బాలికా విద్య ప్రాముఖ్యత, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి వై.విమలకుమారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి ఎస్.రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ కె.ఉషారాణి, ఐసీడీఎస్ ఏపీఓ కె.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారి రమేష్ రామన్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మక్కువ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేందుకు శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, సీడీపీఓ అనంతకుమారి సూచించారు. మండలంలోని పనసబద్ర గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రాణి గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తప్పనిసరిగా తరచూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎస్.లీలావతి, పి.రాజశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పనసబద్రలో గర్భిణులకు సీమంతాలు

మట్టి విగ్రహాలను పూజించండి

- ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్:

మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పాత బస్టాండ్‌లో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాల వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. ఉత్సవాలు నిర్వహించే యువత ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పోలీస్ శాఖ ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్వతీపురం మన్యం జిల్లా లీగల్ అడ్వైజర్ మజ్జి వెంకటేష్, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి జగదీష్, జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల సర్వేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వావిలపల్లి సూర్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బోటు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

వైద్య సేవలను పర్యవేక్షించండి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ

సీతానగరం: గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారులు, సూపరువైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.జగన్మోహనరావు సూచించారు. సీతానగరం ఆర్‌సీహెచ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులలో రోగుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది రోగులు శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నారన్నారు. ఇక్కడి నుండి వైద్య సేవలందిస్తున్న రోగులను సూపరువైజర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు వస్తున్న సమాచారం మేరకు జ్వరాలున్న గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. తక్కువ కాలపరిమితి ఉన్న మందుల ఇచ్చే సమయాన్ని పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉచిత వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది పీహెచ్‌సీకి అందుబాటులో ఉండాలని, అత్యవసర సేవలందించడానికి సిద్ధం కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ పావని, సూపరువైజర్లు, టెక్నీషియన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్మోహనరావు

సీతానగరంలో భారీ వర్షం



ప్రవహిస్తున్న కొండవాగు కాలువ

సీతానగరం: మండలంలో శుక్రవారం సాయంత్రం అర్ధ గంట సేపు భారీ వర్షం కురిసింది. దీంతో కాశీపేట, చినబోగిలి, తామరఖండి - మక్కువ రోడ్లన్నీ జలమయ్యాయి. పెదబోగిలి పంచాయతీ అప్పయ్యపేట గ్రామానికి ఎగువనున్న కొండగెడ్డవాగు వరద ఎక్కువ కావడంతో వీధుల్లోకి నీరు వచ్చి చేరడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కొండవాగు కాలువలో మట్టి పనులు చేపట్టకపోవడంతో కొండపై నుంచి బురద నీరంతా వీధుల్లోకి వచ్చి చేరడంతో ఇబ్బందులు పడుతున్నారు.



వీధుల్లో ప్రవహిస్తున్న బురద నీరు

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

పార్వతీపురం టౌన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సహాయ కార్యదర్శి తోట జీవన్ అన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో విరాళాలు శుక్రవారం సేకరించారు. పట్టణంలో విరాళాల సేకరణ కాంప్లెక్స్ నుండి నాలుగు రోడ్లు జంక్షన్ వరకూ చేపట్టారు. దాతల నుండి రూ 10,500 విరాళాలు సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యంలో మండల కమిటీ ప్రతినిధులు శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విజయవాడలో సంభవించిన వరదల కారణంగా ధన, ప్రాణనష్టం వాటిల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రజలు తనవంతు సహకారాన్ని అందించాలని కోరారు. మండల కేంద్రంలో రూ.4450లు సేకరించామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.వెంకటరమణ, రెడ్డి ఈశ్వరరావు, ఆర్.రాము పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తం..

భామిని: అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారం మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నిమ్మల శేఖరం అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంశధార నదీతీరంలో వరద ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. వినాయక ఉత్సవాలు, నిమజ్జనంలో అపశృతులు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. చంద్రరావు, ఎంఏఓ కె.సింహాచలం, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, ఏఎస్సై కాంతారావు, ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓలు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: రానున్న రెండు రోజుల్లో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున అధికారులంతా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పోలీస్, జలవనరుల శాఖ, మండల పరిషత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాలు భారీగా కురిస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు.



విఘ్నేశ్వర ప్రతిమల విక్రయం



భక్తుల కొనుగోలుతో కిటకిటలాడుతున్న మక్కువ మార్కెట్

తొలి పూజకు సర్వం సిద్ధం

విఘ్నేశ్వర పూజకు భక్తులు సిద్ధమయ్యారు. శనివారం నాటి వినాయక చవితి పూజకు కావాల్సిన విఘ్నేశ్వర ప్రతిమలు, పూలు, పండ్లు, పత్రి తదితర విక్రయాలతో మక్కువ మార్కెట్ శుక్రవారం రద్దీగా మారింది. పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు మార్కెట్‌కు తరలిరావడంతో వినాయక చవితి సందడి ముందే కనిపించింది. కొనుగోలుతో మార్కెట్ కిటకిటలాడింది. – మక్కువ